సాక్షి
తిరుపతి

ఆదివారం । 22 । జూన్ । 2025



ఆరోగ్య యోగం

- విద్యాలయాల్లో యోగా తప్పనిసరి
- కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్, జేసీ, కమిషనర్, వీసీలు

తిరుపతి సిటీ : అన్ని విద్యాలయాల కరికులంలో యోగా తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ తారకరామ స్టేడియంలో ఏర్పాటు చేసిన 11వ ప్రపంచ యోగా దినోత్సవంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, ఎస్వీ, వేదిక్ యూనివర్సిటీ వీసీలు ఆచార్య అప్పారావు, సదాశివ మూర్తి, అధికారులతో కలసి యోగాంధ్ర కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 11వ అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని 6200 ప్రాంతాల్లో సుమారు 9 నుంచి 10 లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. యోగాతో ఆరోగ్య దక్పథం అలవడాలన్నారు. అనంతరం పలు పాఠశాలలు, కళాశాల నుంచి విచ్చేసి విద్యార్థులు, జిల్లాలోని పలు శాఖలకు చెందిన ఉద్యోగులు యోగాసనాలను చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రైల్వే గ్యారేజ్ పరిశీలన



మాట్లాడుతున్న రైల్వే బోర్డు అడిషనల్ మెంబర్ సంజయ్ కుమార్ పంకజ్

రేణిగుంట : తిరుపతి– రేణిగుంట మార్గంలోని రైల్వే గ్యారేజ్‌ను రైల్వే బోర్డు అడిషనల్ మెంబర్ సంజయ్ కుమార్ పంకజ్ శనివారం పరిశీలించారు. సీఆర్ఎస్ చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ దేవ సహాయం ఆయనకు స్వాగతం పలికారు. సీఆర్ఎస్ లోని అన్ని షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సీఆర్ఎస్ బ్రాంచ్ నాయకులు ఆయనను కలిసి తమ సమస్యల పైన వినతి పత్రం అందించారు. మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ బాబు మాట్లాడుతూ..సీఆర్ఎస్‌లో ఖాళీగా ఉన్న 306 పోస్టులను భర్తీ చేయాలని, వందే భారత్‌కు మాన్‌పవర్ ఇచ్చి దీనిపైన అందరికీ ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు.సీ ఆర్ఎస్‌లో ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీడబ్ల్యూ ఈ అమిత్ గుప్తా, మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ చైర్మన్ సదాశివ రెడ్డి, ట్రెజరర్ మునికుమార్, ఆఫీస్ బేరర్స్ మునిరాదయ్య, చంద్ర నాయక్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : వైఎస్ఆర్ కడపలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు ఉన్న గడువును 25వ తేదీ వరకు పొడిగిస్తూ ఆ పాఠశాల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ''ఏపీఎస్‌పీఓఆర్‌టీఎస్‌ఎస్‌సీహెచ్‌ఓఓఎల్.ఏపి.జీఓవి.ఇన్'' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేణిగుంట కేవీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

రేణిగుంట : రేణిగుంట సీఆర్ఎస్ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు శనివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 2వ తరగతి (01), 4వ తరగతి (08), 9వ తరగతి (07) సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల వారు ఈనెల 23 నుంచి 25 సాయంత్రం 4 గంటల లోపల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈనెల 21 నుంచి జూన్ 28వ తేదీ వరకు నిర్వహించనున్న సర్టిఫికెట్ల పరిశీలన (కౌన్సెలింగ్) శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి, గూడూరు, సత్యవేడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు తిరుపతి కేటి రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. తొలి రోజు 1 నుంచి 15 వేలలోపు ర్యాంకు సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. తొలిరోజు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు తిరుపతిలో 107 మంది, గూడూరులో 30 మంది, సత్యవేడులో 6 మంది, మొత్తం 143 మంది విద్యార్థులు హాజరై సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం 15,001 నుంచి 32 వేల ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

యువతకు శరగోపం!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల్లో యువతపై హామీల వర్షం కురిపించింది. ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడుస్తున్నా ఏ ఒక్క హామీ అమలు చేయకపోవడంతో యువత మండిపడుతోంది. ఏటా 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ బూటకంగా మారింది..ఇక జాబ్ క్యాలెండర్ హామీ అడ్రస్ లేకుండా పోయింది.. నిరుద్యోగ భృతి హామీ ఊసే లేదు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపు మాటే ఎత్తడం లేదు. ఇలా యువతను ఎన్నికల్లో నమ్మించి ఓట్లు దండుకొని దగా చేసింది. హామీల అమలు కోసం యువత పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి సోమవారం యువత పోరుకు పిలుపునిచ్చింది.

కూటమి హామీల అమలుపై రేపు యువత పోరు

- ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు.. జాబ్ క్యాలెండర్ అంటూ దగా
- ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామంటూ మోసం
- ఫీజు బకాయిలతో ఉన్నత విద్యకు దూరమవుతున్న యువత
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వం

తిరుపతి సిటీ : యువతకు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల భృతి అందిస్తామంటూ సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు అండ్ కో యువతను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారు. కూటమి అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ ఊసేలేదు.. నిరుద్యోగ భృతి లేదు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా యూటర్న్ తీసుకున్న కూటమి సర్కార్‌ను చూసి మోసపోయామంటూ యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఉద్యోగాల కల్పన మాట దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలను తొలగించి చిరుద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నారు. జగనన్న పాలనలో తొలి ఏడాదిలోనే జిల్లాలో 65 వేలకు పైగా శాశ్వత, తాత్కాలిక ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు అండగా నిలిచారు.

భృతి భ్రాంతి

ఏటా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలతో జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నా ప్రభుత్వం ఆ ప్రస్తావన ఎత్తడం లేదు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో కలిపి ఖాళీగా ఉన్న సుమారు 98 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ తుంగలో తొక్కేశారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతకు అదే ఏడాదిలో ఉద్యోగం కల్పించేందుకు పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టిస్తామని ప్రగల్భాలు పలికారు. ఏడాదిగా జిల్లాలో వేల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున భృతి అందిస్తామని చెప్పిన చంద్రబాబు అండ్ కో భృతి ఇవ్వలేమంటూ చేతులెత్తేశారు.

యువగళం..అబద్ధాలమయం

ఎన్నికల్లో యువతకు గాళం వేసి ఓట్లు దండుకునేందుకు యువగళం పేరుతో పాదయాత్ర ప్రారంభించిన లోకేష్ ఊరు వాడా తిరుగుతూ అబద్ధాల మాటలతో ముఖాముఖి పేరుతో సభలు నిర్వహించారు. ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాలను ఏటా భర్తీ చేస్తామని, ఏడాదికి 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి తీరుతామని ఊదరగొట్టారు. అధికారం చేపట్టి విద్యా మంత్రిగా తనకు మాత్రమే ఉపాధి కల్పించుకుని నిరుద్యోగులకు అన్యాయం చేశారు. 2024 జూన్ నుంచి ఏడాదిగా ఒక్క ఉద్యోగాన్ని భర్తీ చేయలేని అసమర్థ ప్రభుత్వంగా చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. గత రెండేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో జిల్లాలోని సుమారు 70వేలమంది విద్యార్థులు అప్పులు చేసి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో యువతకు బంగారు బాట

వైఎస్సార్‌సీపీ పాలనలో యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేసింది. అధికారం చేపట్టిన మూడు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 2.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారు. జిల్లాలో సుమారు 6786 మంది సచివాలయ ఉద్యోగాలు, 11,500 వలంటీర్ల నియామకం, ప్రభుత్వ శాఖలలో 8,600 ప్రభుత్వ ఉద్యోగాలు, 21,750 తాత్కాలిక ఉద్యోగాలను భర్తీ చేశారు. దీంతో పాటు తాత్కాలిక ఉద్యోగులను అప్కాస్ కిందకు తెస్తూ ఉద్యోగ భద్రత కల్పించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలల్లో పెద్ద ఎత్తున జాబ్ మేళాలు నిర్వహించి తొలి ఏడాదిలోనే సుమారు 1.24 లక్షల ఉద్యోగాలను నిరుద్యోగులకు అందించారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు సర్కార్ బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సైతం చెల్లించి విద్యార్థులను ఉన్నత విద్య వైపు అప్పటి జగనన్న ప్రభుత్వం ప్రోత్సహించింది.

రేపు వైఎస్సార్‌సీపీ యువత పోరు

యువత, విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతూ వారి పక్షాన నిలబడి గళం విప్పేందుకు సోమవారం యువత పోరు నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువతకు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువత, విద్యార్థులు పార్టీ శ్రేణులతో కలిసి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నారు. యువత పోరును విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది.

జిల్లాలో నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

నియోజకవర్గం	ఎస్ఎస్సీ,ఇంటర్	ఐటీఐ,డిప్లొమో	యూజీ	పీజీ ఆపైన
తిరుపతి	92,210	26,560	56,102	22,940
చంద్రగిరి	77,357	35,865	45,776	16,887
శ్రీకాళహస్తి	65,720	38,150	41,805	14,125
వెంకటగిరి	45,771	25,900	38,007	10,750
సూళ్లూరుపేట	51,325	17,550	35,650	9,255
గూడూరు	44,867	12,763	40,127	11,558
సత్యవేడు	50,122	13,407	31,252	10,657

జిల్లాలో ఏడాదిగా నిరుద్యోగులకు చెల్లించాల్సిన భృతి

నియోజకవర్గం	అభ్యర్థులు	చెల్లించాల్సిన భృతి(రూ.కోట్లలో)
తిరుపతి	1,97,812	82.60
చంద్రగిరి	1,77,885	60,80
శ్రీకాళహస్తి	1,59,800	50.86
వెంకటగిరి	1,20,428	43.35
సూళ్లూరు పేట	1,13,780	40.96
గూడూరు	1,09,315	41.61
సత్యవేడు	1,05,438	38.37

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వివరాలు

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్ (రూ.కోట్లలో)
తిరుపతి	8,452	22.75
చంద్రగిరి	5,765	10.90
శ్రీకాళహస్తి	3,986	9.17
వెంకటగిరి	2,521	6.53
సూళ్లూరు పేట	3,129	8.84
గూడూరు	3,741	8.37
సత్యవేడు	2,954	5.68

కూటమి ఏడాది పాలనలో జిల్లాలో తొలగించిన ఉద్యోగుల వివరాలు

తాత్కాలిక ఉద్యోగులు	13,498
విద్యా వైద్య రంగంలో	15,350
ఔట్‌సోర్సింగ్	10,125
తొలగించిన రేషన్ ఎండీయూలు	369
మద్యం దుకాణాల ఉద్యోగులు	856
వలంటీర్లు	11,938
నిర్మాణ రంగంలో ఉపాధి కోల్పోయిన వారు	27,457
ఉపాధి కోల్పోయిన వీధి విక్రయదారులు	25 వేలకు పైగా

నమ్మించి మోసగించింది..



కూటమి ప్రభుత్వం ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం వచ్చినంత వరకు నెలకు రూ.3 వేలు ఇస్తామని యువతను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. భృతి భ్రాంతిగానే మిగిలిపోయింది. 2014లో ఇలానే యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. – శకుంతల, ఎమ్మెస్సీ పీహెచ్‌డీ, తిరుపతి

యువగళం మూగబోయింది..



యువగళం పాదయాత్ర అంటూ హంగామా చేసిన మంత్రి లోకేష్ అధికారం వచ్చిన తర్వాత యువగళంలో ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికొదిలేశారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం, భృతి అందిస్తూ ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన లోకేష్ మాట వరుసకైనా ఆ ప్రస్తావన ఎత్తడం లేదు. అధికారం చేపట్టిన తరువాత యువగళం మూగబోయింది. – ప్రసన్న కుమార్, ఎంకామ్, తిరుపతి రూరల్

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తారనే నమ్మకం పోయింది



రెండేళ్లుగా తిరుపతి జిల్లాలో సుమారు 15 వేల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదు. దీంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను టార్చర్ పెట్టి ఫీజులు కట్టించుకున్నారు. ఈ ఏడాది ఇంటర్ పూర్తి అయింది. బీటెక్ కోర్సులో చేరాలని అనుకుంటున్నా. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే ఇబ్బందులు పడుతావని సహచరులు అంటున్నారు. – శ్రీనివాసులు, విద్యార్థి, వెంకటగిరి

నిరుద్యోగ భృతి బకాయితో కలిపి చెల్లించాలి



యువగళంలో లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు చెల్లించాలి. ఏడాదిగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదు. ఇప్పటి వరకు 12 నెలలకు గాను ఒక్కో నిరుద్యోగికి రూ. 36 వేలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు వెంటనే చెల్లించి నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి. – సురేంద్రారెడ్డి, పరిశోధక విద్యార్థి, తిరుపతి

జాబ్ క్యాలెండర్ ఎక్కడ ?



ఏటా జనవరి ఒకటో తారీఖున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఆ ఊసే ఎత్తడం లేదు. యువతను కూటమి సర్కార్ వంచించింది. వైఎస్సార్‌సీపీ పాలనలో తొలి ఏడాదిలోనే 2.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారు. అందులో మా అక్కకు సైతం ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉంది. – సుమిత్ర, ప్రైవేటు ఉద్యోగిని, శ్రీకాళహస్తి

మేనిఫెస్టో అమలు చేయాలి



నేను డిగ్రీ పూర్తి చేశా. ఇంటికో ఉద్యోగం ఇస్తా మని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ప్రస్తుతం ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా. నిరుద్యోగ భృతి అమలుపై వెంటనే విధి విధానాలు విడుదల చేసి స్పష్టత ఇవ్వాలి. ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. 3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందజేయాలి. – హెప్సీ, వరదయ్యపాళెం మండలం

భృతిపై స్పష్టత ఇవ్వాలి



ఎన్నికల్లో నిరుద్యోగ భృతిని అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో ఎంతో మంది నిరుద్యోగులు ఆశగా ఎదురు చూశారు. అయితే ఏడాది గడిచిపోయింది. నేటికి నిరుద్యోగ భృతిపై స్పష్టత లేకుండా పోయింది. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. – పల్లం లక్ష్మీనారాయణ, నిరుద్యోగి, అరూరు, చిట్టమూరు మండలం

మామిడి రైతులకు న్యాయం చేయండి

- గిట్టుబాటు ధరపై చిత్తూరు కలెక్టరేట్ వద్ద ధర్నా
- రైతులతో చిత్తూరు కలెక్టర్ చర్చలు
- ప్రభుత్వ సబ్సిడీ పెంపునకు ప్రతిపాదనలు



మామిడి ధరల విషయమై కలెక్టర్‌తో చర్చిస్తున్న రైతు సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మామిడి నేలరాలుతోందని, న్యాయం చేయాలని మామిడి రైతులు, రైతు సంఘాల నాయకులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. శనివారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద రైతు సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి న్యాయం చేయాలంటూ కూటమి ప్రభుత్వ అలసత్వ వైఖరిని ఎండగట్టారు. రైతు సంఘం నాయకులు జనార్దన్ మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు మామిడి కిలో రూ.12 పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని అనేక ఫ్యాక్టరీలు ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదన్నారు. చాలా ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాల్సింది పోయి రూ.5 ఇస్తున్నాయన్నారు. వారిని చూసి ర్యాంపుల నిర్వాహకులు రూ.3 ఇస్తున్నారని చెప్పారు. ఫ్యాక్టరీల వద్ద మామిడి రైతుల ట్రాక్టర్లు రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వం అందజేసే రూ.4 సబ్సిడీని రూ.6గా అందజేయాలని డిమాండ్ చేశారు.

సబ్సిడీ రూ.5 ఇచ్చేలా ప్రతిపాదనలు

అనంతరం రైతు సంఘ నాయకులతో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ చర్చలు జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పరిస్థితుల కారణంగా గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.6 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ప్రస్తుతం అందజేస్తున్న సబ్సిడీ రూ.4కు బదులు రూ.5 ఇచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ర్యాంపుల ఆగడాలను అరికడతామని హామీ ఇచ్చారు. జిల్లాలో నిబంధనలు పాటించని నాలుగు ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ర్యాంప్‌లను సైతం క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. రైతు సంఘ నాయకులు రామానాయుడు, ఉమాపతి, మునీశ్వర్‌రెడ్డి, ఆనంద్‌నాయుడు, మునిరత్నం, హేమలత, భారతి, రాజేందర్‌రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం బోల్తా.. తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చంద్రగిరి : అదుపు తప్పి వాహనం బోల్తా పడిన ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా క్షేమంగా బయటపడిన ఘటన శనివారం తెల్లవారుజామున పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి అగరాల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటకకు చెందిన కారు చిత్తూరు వైపు నుంచి తిరుపతికి వస్తున్న క్రమంలో అగరాల సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద అదుపు తప్పింది. దీంతో కారు జాతీయ రహదారి పక్కన ఉన్న కాలువను ఢీకొట్టి, సర్వీసు రోడ్డుపై బోల్తా పడి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారులో డ్రైవరు తప్ప ఎవరూ లేకపోవడంతో, డ్రైవరు సీటు బెల్టు పెట్టుకోవడంతో చిన్నపాటి గాయలయ్యాయి. అనంతరం క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. గాయపడిన క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.

నేడు ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1998, 2008 డీఎస్సీ (ఎంటీఎస్, మినిమం టైం స్కేల్) టీచర్లకు ఆదివారం బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎంటీఎస్ టీచర్లకు మాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల సీనియారిటీ జాబితా సంబంధిత మండలాలకు పంపినట్లు చెప్పారు. ఆ జాబితా ప్రకారం ఆదివారం చిత్తూరులోని డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కౌన్సెలింగ్ కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. 2008 ఎంటీఎస్ టీచర్లకు ఉదయం 10 గంటలకు, 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

నేడు గురుకులాల్లో సీట్ల కేటాయింపు

తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆదివారం సీట్లు కేటాయించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి బాలికలకు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు సమీపంలోని సంజయ్ గాంధీ కాలనీలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అలాగే బాలురకు చిత్తూరులోని వేము ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని పూతలపట్టు బాలుర గురుకుల పాఠశాలలో సీట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి హాజరు కావాలని ఆమె కోరారు.

ఇటు కోతలు.. అటు దాడులు!

జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చినా మద్దతు ధర లేక నష్టాల్లో కూరుకుపోతున్నారు. గుజ్జు పరిశ్రమల నిర్వాహకులు సకాలంలో అన్‌లోడ్ చేసుకోక ట్రాక్టర్ల ట్రక్కుల్లోనే కాయలు కుళ్లిపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. కొందరు కాయలను తోటల్లోనే వదిలేయడంతో అవి మాగి వాసన వెదజల్లుతున్నాయి. ఇదే అదునుగా ఏనుగుల మంద తోటలపై పడి ఉన్న కాయలను ఊడ్చేస్తుండడంతో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది.

త్రిశంకుస్వర్గంలో మామిడి రైతులు

- తోటల్లోనే మాగిపోతున్న తోతాపురి
- మామిడి వాసనతో తోటలపై దాడులకు దిగుతున్న గజరాజులు
- ధరల్లేక.. ఏనుగుల దాడులతో అల్లాడి పోతున్న అన్నదాతలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



పెద్దపంజాణి మండలం తిప్పిరెడ్డి పల్లి వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి పంట



బంగారుపాళెం సమీపంలో మామిడి కాయలను ట్రాక్టర్‌లో తీసుకొచ్చి పడేస్తున్న రైతులు

పలమనేరు: జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఈ ఏడాది ఎంతగానో ఆశలు పెట్టుకున్న మామిడి రైతన్నలను నట్టేట ముంచేసింది. తోతాపురి రైతులను కష్టాల్లోకి నెట్టేసింది. వీటికి ధరల్లేక గుజ్జు పరిశ్రమల్లో టోకెన్లు చిక్కక, స్థానిక మండీల్లో అడిగేవారు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారులేమో తోటల్లోని కాయలను పలు దఫాలుగా కోయాలని ఆంక్షలు పెడుతున్నారు. మరోవైపు తోటల్లోనే కాయలు మాగి నేలరాలుతున్నాయి. మాగిన మామిడి వాసనతో కౌండిన్య అడవిలోంచి ఏనుగుల గుంపు మామిడి తోటలపై పడి కాయలను ఆరగిస్తున్నాయి.

నాలుగు నియోజకవర్గాల్లో మరీ ఘోరం

జిల్లాలో 87 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏటా ఈ సీజన్‌లో 7 లక్షల టన్నుల దాకా దిగుబడి ఉంటుంది. ఇందులో 45 వేల ఎకరాల్లో తోతాపురి రకమే ఉంది. మూడున్నర లక్షల టన్నుల దాకా తోతాపురి దిగుబడి ఉంటుంది. కాగా ఏనుగుల సంచారం ఉన్న పలమనేరు, కుప్పం, పుంగనూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 40వేల ఎకరాల్లో మామిడి ఉండగా.. ఇందులో 22వేల ఎకరాలు తోతాపురి ఉంది. వీటికి ధరల్లేక రైతులు తోటల్లోనే మామిడిని వదిలేశారు. ఇదే అదునుగా ఏనుగులు మామిడి తోటలనే టార్గెట్ చేస్తున్నాయి. పలమనేరు, బంగారుపాళెం, పెద్దపంజాణి, గంగవరం, సోమల, గుడిపాల తదితర మండలాలు కౌండిన్య అడవికి సమీపంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఇటీవల ఏనుగుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. ఫలితంగా రెండు విధాలుగా మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

లోకల్ ర్యాంపుల్లో మొదలుకాని వ్యాపారం

తోతాపురికి ఆయా ప్రాంతాల్లోనే ర్యాంపులు పెట్టి సరుకును కొనేవారు. దీంతో ఫ్యాక్టరీలకు వెళ్లే సరుకు తగ్గేది. ఈ దఫా ధరలు లేనందున బయటి వ్యాపారులు చాలా చోట్ల ర్యాంపుల వద్ద మామిడి కాయల వ్యాపారాలు మొదలు పెట్టలేదు.

నేలరాలుతున్న మామిడి

సీజన్ ఆఖర్లోనైనా ధరలు పలుకుతాయేమోనని చాలామంది రైతులు తోటల్లోనే కాయలను వదిలేశారు. మాగిన కాయలు రాలి నేలపాలవుతున్నాయి. ఎంత ధర దక్కినా అమ్ముదామనుకొని కాయలు దింపిన రైతులు గుజ్జు ఫ్యాక్టరీల వద్దకెళితే టోకెన్లు దొరకడం లేదు. ఫ్యాక్టరీల వద్ద బండ్లు పెట్టుకొని వేచి చూడాల్సి వస్తోంది. దీంతో కొందరు రైతులు మార్కెట్‌కు తీసుకెళ్లిన మామిడి కాయలను చేలల్లో పారబోసి వచ్చేస్తున్నారు. మరికొందరు తోటల్లో కాయలు కోయకుండానే వదిలిపెట్టేస్తున్నారు. టమాటాల కంటే తోతాపురి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఏనుగులు తినేస్తున్నాయి



మాకు 2.5 ఎకరాల్లో మామిడితోట ఉంది. ఈ మధ్య రెండు సార్లు ఏనుగుల మంద తోటపై పడి కాయలను తిని, కొమ్మలను విరిచేశాయి. పోనీ కాయలు దించి అమ్ముదామంటే కిలో రూ.3 కూడా కొనేవారు లేరు. సంవత్సరానికోపంట.. దీన్ని నమ్ముకుని బతికేటోళ్లం. అందుకే మామిడితోటే వద్దనుకుంటున్నాం. – నాగరత్నమ్మ, తిప్పిరెడ్డిపల్లి

భారీగా నష్టపోయాం



ఈ దఫా మామిడితోటలు కొని లక్షల్లో నష్టపోయాం. తోటకు కొట్టిన మందుల ఖర్చు, తోటమాలి డబ్బు కూడా మిగల్లేదు. పలమనేరులో ర్యాంపు లేదు. బంగారుపాళెంకు పోవాలంటే టన్నుకు ట్రాక్టర్ బాడుగ, కూలీలకే రూ.2,500 అవుతోంది. అక్కడ టన్నుకు దక్కేది రూ.3 వేలు. మాకు మిగిలేది రూ.500. – నయాజ్, మామిడితోటల కొనుగోలుదారు, పలమనేరు

పలు దఫాలుగా కోతలు కోయాలి



రైతులు తోటల్లోని కాయలను మాగినవి మాత్రమే పలు దఫాలుగా కోయాలి. అప్పుడు సీజన్ ఆఖర్ దాకా కోతలుంటాయి. ఒకేసారి కాయలన్నీ దించేసి వాటిని అమ్ముకోలేక ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇంకా ర్యాంపులు ప్రారంభం కానిచోట్ల ర్యాంపులు ప్రారంభించే చర్యలు తీసుకుంటున్నాం. – మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

చెవిరెడ్డిపై కక్ష సాధింపు



శ్రీ కల్యాణ వేంకటేశ్వరునికి కొబ్బరికాయలు కొడుతున్న తుమ్మల గుంటకు చెందిన మహిళలు

- కల్యాణ వెంకన్నకు గ్రామస్తుల సామూహిక అర్చనలు

తిరుపతి రూరల్ : 'ఆపదంటే ఒక్క క్షణం ఆలోచించడు.. అది మా ఊరైనా.. ఏ ఊరైనా.. కష్టంలో ఉంటే కాదనకుండా సాయం చేస్తాడు.. దేవుడంటే భక్తి.. పదవి ఇచ్చిన ప్రజలంటే భయం.. అలాంటి వ్యక్తి తప్పు చేశాడంటే ఎవరు నమ్ముతారు.. కుట్ర రాజకీయాలతో చెవిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు.. అంటూ తుమ్మలగుంటకు చెందిన పలువురు మహిళలు కూటమి ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం చెవిరెడ్డి పేరిట సామూహిక అర్చనలు చేశారు. చెవిరెడ్డి ఆరోగ్యం సరిగా లేదని, జైలు నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని మీడియా ద్వారా తెలుసుకుని మదనపడుతున్న ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మికి ఓదార్పు కలిగించారు. చెవిరెడ్డి లక్ష్మి ఏకాంతంగా ఆ దేవుడి ముందు కూర్చుని తన భర్త ఆరోగ్యం బాగుండేలా చూడాలని, అందరికీ సాయం చేసిన తన భర్తకు ఈ కష్టం ఎందుకు పెట్టావు అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఆ తరువాత ఆలయం వెలుపలకు వచ్చి గ్రామానికి చెందిన మహిళలతో కలసి ఆలయం ముందు 1,116 కొబ్బరికాయలు కొట్టి చెవిరెడ్డి ఆరోగ్యం బాగుచేయాలని ప్రార్థించారు. ఏ తప్పు చేయని చెవిరెడ్డిని జైలుకు పంపించిన దుర్మార్గులు భూస్థాపితమవుతారని ఆరోపించారు. చెవిరెడ్డి రాజకీయంగా ఎదగడానికి పది మందికి మంచి చేయాలని ఆలోచిస్తారే తప్ప కోట్లు సంపాదించాలన్న ఆలోచన ఎప్పుడు చేయలేదన్నారు. తుమ్మలగుంట గ్రామం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిదంటే అది ఒక్క చెవిరెడ్డి వల్లనే సాధ్యమైందని, ఆయనకి తమ గ్రామంపైన ఉన్న మక్కువ అలాంటిదన్నారు. ఈ గ్రామానికి ఆయన ఎంతో చేశారని, ఆయనకు తోడుగా నిలబడాల్సిన సమయం వచ్చినందున గ్రామంలో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆయన చేసిన మంచిని చెప్పుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో అక్రమ కేసుల నుంచి కడిగిన ముత్యంలా బయటకు రావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామం నుంచి సుమారు 100 మందికిపైగా మహిళలు ఆలయం వద్దకు వచ్చి చెవిరెడ్డి ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ ఆ కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా కల్పించారు.

డ్వాక్రాలో తమ్ముళ్ల పెత్తనం



వెలుగు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రూపు సభ్యులు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రూపు సభ్యులు

- రుణాలు రాకుండా కక్ష సాధింపు
- మెజారిటీ గ్రూపు సభ్యుల మాటను లెక్క చేయని వైనం
- టీడీపీ నాయకులకు అధికారుల సహకారం
- రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రూపు సభ్యులు

పాకాల : డ్వాక్రా గ్రూపులో పది మంది సభ్యులు ఉన్నా మరోక సభ్యురాలిని చేర్చుకోవాలని స్థానిక టీడీపీ నేత ఓ సంఘంపై కొద్ది రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. సంఘంలోని సభ్యులు దానికి ఒప్పుకోకపోవడంతో ఆ సంఘానికి రుణాలు రాకుండా ఆ టీడీపీ నేత అడ్డుపడ్డాడు. దీంతో విసిగిపోయిన ఆ మహిళా సంఘం సభ్యులు శనివారం తమ ఊరిలోని రోడ్డుపైనే నిరసనకు దిగారు. అనంతరం వెలుగు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగి న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు. అర్హత ఉన్నా రుణాలు రాకుండా అడ్డుకోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మహిళా సంఘానికి న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మహిళల అభివృద్ధికి డ్వాక్రా సంఘాలు కీలకంగా వ్యవహరిస్తాయి. అలాంటి సంఘాల్లో టీడీపీ నాయకులు రాజకీయ చిచ్చు రేపి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు రేపుతున్నారు. మండలంలోని మద్దినాయనపల్లి పంచాయతీ కొత్త ఒడ్డిపల్లిలో దుర్గా మహిళా మండల సంఘాన్ని స్థానిక మహిళలు 10 మంది గ్రూపుగా ఏర్పడి సంఘాన్ని నిర్వహిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ కూటమి నేత తల్లి ఇదే గ్రూపులో ఉండడంతో కుటిల రాజకీయానికి తెర లేపారు. టీడీపీ నాయకుడు తల్లి ఉన్న గ్రూపులోనే తన భార్యను కూడా చేర్చాలని మరో టీడీపీ నేత వారిపై ఒత్తిడి తెచ్చాడు. గ్రూపు సభ్యులు మేము 10 మంది సరిపోయామని, 11 మంది తమ గ్రూపులో అవసరం లేదని చెప్పారు. దీంతో ఆగ్రహించిన ఆ కూటమి నేత మండల స్థాయి నాయకులతో కలసి గ్రూపు సభ్యులకు ఎలాంటి రుణాలు అందకుండా అడ్డుపడుతున్నాడు. నాయకుల చేతుల్లో కీలు బొమ్మలుగా వ్యవహరిస్తున్న వెలుగు అధికారులు గ్రూపు సభ్యులకు రుణాలు రానీయకుండా చేస్తున్నారని గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు. సుమారు 5 నెలలుగా ఇదే తంతు నడుస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. కొత్త ఒడ్డిపల్లి గ్రామానికి చెందిన కూటమి నాయకుడు ఎంత దూరమైనా వెళతానని, నా భార్యను చేర్చుకోకుంటే గ్రూపు ఎలా నడుస్తుందో చూస్తానని బెదిరిస్తూ గ్రూపు సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు.

బెదిరింపులు ఇలా..

మండలంలోని కొంత మంది నాయకులు మహిళలు ఉండే కార్యాలయంలోనే తిష్ట వేసుకుని అధికారుల పనులకు ఆటంకం కలిగిస్తున్నారు. రాజకీయ చర్చలు ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహిస్తూ విసుగు పుట్టిస్తున్నారు. ముఖ్యంగా దుర్గా మహిళా మండలికి రుణాలు రానీయకుండా చేయడానికి వెలుగు అధికారులపై బెదిరింపులకు దిగినట్లు సమాచారం. మా కూటమి ప్రభుత్వంలో మేము చెబితే పనులు చెయ్యరా, మీకు ఎమ్మెల్యేనే చెప్పాలా..? మేము లీడర్లుగా కనిపించడం లేదా అంటూ తెగ బెదిరింపులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు 5 నెలలుగా డ్వాక్రా సంఘాల ద్వారా రావాల్సిన రుణాలు రాక గ్రూపు సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే గ్రామంలో ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో మరో 4 గ్రూపులకు కూడా రుణాలు మంజూరు చేయకుండా పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు కూటమి నాయకులు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు జోక్యం చేసుకుని గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.